ప్రజాశక్తి

గురువారం 18 ఏప్రిల్ 2024 పేజీలు 8





విజయనగరం పార్వతీపురం మన్యం

నేటి నుంచి నామినేషన్లు

- 25 వరకు గడువు • 26న పరిశీలన
- 29న ఉపసంహరణ • మే 13న పోలింగ్
- జూన్ 4న ఓట్లలెక్కింపు, ఫలితాలు వెల్లడి



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సాధారణ ఎన్నికల ప్రక్రియలో అతిముఖ్యమైన ఘట్టం నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం గురువారం నుంచి ప్రారంభం కానుంది. ఇందుకోసం జిల్లా యంత్రాంగం ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి చేసింది. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఈనెల 18వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల నామినేషన్లు స్వీకరించనున్నారు. సెలవు రోజుల్లో మినహా మిగిలిన పనిదినాల్లో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లు అందజేయవచ్చు. ఈ మేరకు ఎన్నికల నోటిఫికేషన్ కూడా గురువారం విడుదల కానుంది. దీని ప్రకారం ఈనెల 26న నామినేషన్ల పరిశీలన, 29న ఉపసంహరణ, మే 13న పోలింగ్ ఉంటాయి. ఓట్ల లెక్కింపు జూన్ 4న జరుగుతుంది. అదే రోజు ఫలితాలను కూడా వెల్లడిస్తారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తి చేశాం. ఈ ప్రక్రియను పూర్తిగా వీడియో రికార్డింగ్ చేస్తాం. సిసి కెమేరాలు ఉన్న గదిలో నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తాం. నిర్ణీత సమయం ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటలు వరకు మాత్రమే నామినేషన్ల స్వీకరణ జరుగుతుంది. ప్రభుత్వ సెలవు దినాల్లో నామినేషన్ల ప్రక్రియ జరగదు. పోటీ చేయబోయే అభ్యర్థులంతా ఖచ్చితంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ, తమ నామినేషన్ పత్రాలను దాఖలు చేయాలి.

- నాగలక్ష్మి, జిల్లా ఎన్నికల అధికారి, విజయనగరం

విజయనగరం పార్లమెంట్ అభ్యర్థుల నామినేషన్లను విజయనగరం కలెక్టరేట్‌లోనూ, అరకు పార్లమెంట్ ఎంపీ అభ్యర్థుల నామినేషన్లను పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్‌లోనూ స్థానిక కలెక్టర్లు (జిల్లా ఎన్నికల అధికారులు) స్వీకరించనున్నారు. శాసనసభ అభ్యర్థుల నుంచి నియోజకవర్గ కేంద్రాల్లోని సంబంధిత ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరిస్తారు. విజయనగరం, పార్వతీపురం మన్యం అసెంబ్లీ అభ్యర్థుల నుంచి ఆయా మండల తహశీల్దార్ కార్యాలయాల్లో సంబంధిత జిల్లా జాయింట్ కలెక్టర్లు స్వీకరించనున్నారు. కలెక్టరేట్లలో ఏర్పాటు చేసిన సహాయ కేంద్రాల్లో అభ్యర్థులు నామినేషన్ల పత్రాలకు సంబంధించి తప్పుపొప్పులను సరిచేసుకోవచ్చు. నియోజకవర్గ కేంద్రాల్లోనూ ఇదే రీతిలో హెల్ప్‌డెస్కులు ఉంటాయి. నామినేషన్ల స్వీకరణ, పరిశీలనకు సంబంధించిన ఏర్పాట్లు అధికారులు ఇప్పటికే చేశారు.

నామినేషన్ల స్వీకరణ నుంచి సంబంధిత అభ్యర్థుల ఖర్చును లెక్కిస్తారు. ఒక్కో అభ్యర్థి గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేయవచ్చు. ఒక అభ్యర్థి ఏవైనా రెండు స్థానాల్లో మాత్రమే పోటీ చేసేందుకు అవకాశం ఉంది. నామినేషన్లు దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో నలుగురిని మాత్రమే ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయం వరకు అనుమతి ఇస్తారు. మిగిలిన వారిని 100 మీటర్ల అవతల (మిగతా..3లో)



కల్యాణం సందర్భంగా తాళి బొట్టు చూపిస్తున్న అర్చకులు

ఘనంగా సీతారాముల కల్యాణం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

శ్రీరామనవమి సందర్భంగా రామతీర్థంలో సీతారాముల కల్యాణం కన్నుల పండువగా జరిగింది. వేద పండితుల మంత్రోచ్ఛారణ, భక్తుల జయజయ ధ్వానాల మధ్య అంగరంగ వైభవంగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వేలాది మంది తిలకరించారు. వేకువ జామున 3 గంటలకు ప్రాత్ణకాల అర్చన అనంతరం స్వామి వారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, ఫలరసాల పంచామృతం, సముద్ర, నదీ జలాలతో ప్రత్యేకంగా అర్చకులు అభిషేకం జరిపించారు. ఉదయం 9 గంటల సమయంలో ఉత్సవ విగ్రహాలను మేళతాలలతో ఊరేగింపుగా కల్యాణ మండపం ప్రాంగణంలో ఉన్న కల్యాణ వేదిక వద్దకు (మిగతా..3లో)



పట్టువస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి బొత్స సత్యనారాయణ కుటుంబ సభ్యులు

ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపుతోనే

రాజ్యాంగానికి రక్షణ

- అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి పాచిపెంట అప్పలనర్స
- పాలకొండలో ర్యాలీ
- 19న నామినేషన్
- రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు రాక
- తరలిరావాలని నాయకుల పిలుపు



మాట్లాడుతున్న అరకు పార్లమెంట్ సిపిఎం అభ్యర్థి అప్పలనర్స

ప్రజాశక్తి-పాలకొండ, సీతంపేట, పార్వతీపురం

రాజ్యాంగాన్ని, రిజర్వేషన్లను కాపాడుకోవాలంటే సిపిఎం, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించి బిజెపి, దాని పొత్తు, తొత్తు పార్టీలకు గుణపాఠం చెప్పాలని సిపిఎం నాయకులు పిలుపునిచ్చారు. సిపిఎం అరకు పార్లమెంట్ అభ్యర్థి పి.అప్పలనర్స బుధవారం పార్వతీపురం సుందరయ్య భవనంలో విలేకర్ల సమావేశంలోను, సీతంపేట మండల కేంద్రంలో నిర్వహించిన పరిచయసభలోను, పాలకొండ సభలోను మాట్లాడారు.. పాలకొండలో ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణ నుంచి ఏలం జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పనర్సతో పాటు సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడారు.

అప్పలనర్స మాట్లాడుతూ బిజెపికి ఈ ఎన్నికల్లో 400 స్థానాలు వస్తే రాజ్యాంగాన్ని మార్చేస్తామని (మిగతా..3లో)

భానుడు భగభగ

అల్లాడుతున్న జనం • నిర్మానుష్యంగా మారిన కూడళ్లు



ఉమ్మడి జిల్లాలో ఎండలు దారెత్తిస్తున్నాయి. భానుడి భగ భగలతో జనం అల్లాడుతున్నారు. ఎన్నడూ లేని విధంగా అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో ప్రజలు ఉదయం 9గంటల తరువాత బయటకు వచ్చేందుకు భయపడుతున్నారు. బుధవారం అత్యధికంగా పార్వతీపురం, సాలూరులో 44 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదు కాగా, విజయనగరంలో 41 డిగ్రీలు నమోదైంది. దీంతో జిల్లా కేంద్రాల్లోని రహదారులు, ప్రధాన కూడళ్లు ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్మానుష్యంగా మారుతున్నాయి. అత్యవసర పనులున్న వారు మినహా మిగతా ఎవరూ బయటకు రావడం లేదు. ఎండను దష్టిలో ఉంచుకుని జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

బుధవారం నమోదైన ఉష్ణోగ్రతల వివరాలు

ప్రాంతం	ఉష్ణోగ్రత (డిగ్రీలలో)
విజయనగరం	41
పార్వతీపురం	44
సాలూరు	44
ఎస్.కోట	40
రాజాం	43
చీపురుపల్లి	39
పాలకొండ	43

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఫిబ్రవరి రెండో వారం నుంచి భగభగలాడుతున్న సూర్యుడు ఏప్రిల్ ఆరంభం నాటికి తన ప్రతాపాన్ని పెంచేశాడు. గతవారం రోజుల నుంచి ఎండ తీవ్రరూపం దాల్చింది. పగటి పూట ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. ఉమ్మడి (మిగతా..3లో)



విజయనగరంలో నిర్మానుష్యంగా మారిన ఎంజి రోడ్డు


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అగ్ని ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి- శృంగవరపుకోట

జాతీయ అగ్రిమాపక వారోత్సవాలలో భాగంగా 3వ రోజు జవహర్ నవోదయ విద్యాలయం కిల్తంపాలెం గ్రామంలో ఉపాధ్యాయులు, విద్యార్థులకు అగ్ని ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. ముఖ్యంగా నివారణ పద్ధతులు గురించి అగ్నిమాపక అధికారి షేక్ మదీనా బుధవారం వివరించారు. విద్యార్థుల చేత ఫైర్ డ్రిల్స్, రిస్క్యు మెథడ్స్ నిర్వహించి అవగాహన కల్పించారు.

అభివృద్ధిలో వైసిపి, టిడిపి విఫలం

ప్రజాశక్తి- బొబ్బిలి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయడంలో వైసిపి, టిడిపి పూర్తిగా విఫలమయ్యాయని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివాసరావు విమర్శించారు. వైసిపి, టిడిపిలకు ప్రజలు అధికారం ఇచ్చినా అభివృద్ధి చేయలేదన్నారు. బొబ్బిలి పట్టణం, గ్రామాల్లో కాంగ్రెస్ హయాంలో జరిగిన అభివృద్ధి మాత్రమే కనిపిస్తుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరల మోసం చేసేందుకు హామీలు ఇస్తున్నారని, నమ్మకుండా కొత్త అభ్యర్థులను గెలిపించి అభివృద్ధికి బాట వేయాలని ప్రజలను కోరారు.

19న మిగులు సీట్లకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - వేపాడ

మండలంలో బక్కునాయుడుపేట వద్ద గల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో 2024వ సంవత్సరానికి 5వ తరగతిలో మిగులు సీట్లు కోసం ఈ నెల 19న కౌన్సిలింగ్ నిర్వహిస్తామని ప్రిన్సిపాల్ ఫ్లోరెన్స్ తెలిపారు. కౌన్సిలింగ్ చీపురుపల్లిలో గల గురుకుల వసతి గృహంలో జిల్లా సమన్వయకర్త ఆధ్వర్యంలో నిర్వహిస్తారని చెప్పారు. ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేడు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంతో పాటు వల్లంపూడి గ్రామాలలో గురువారం ఉదయం 8.30 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్ బాబు తెలిపారు. ఈ రెండు గ్రామాల్లో విద్యుత్ మరమ్మతు పనులు చేపడుతున్న నేపథ్యంలో ఈ అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గుర్తించి తమకు సహకరించాలని కోరారు.


మరి అప్పగించరా..?

- హుదూద్ ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించని ప్రభుత్వం
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన గృహ సముదాయం
- నిరుపయోగంగా మారిన 32 ఇళ్లు
- రూ.1.27 కోట్లు ప్రజా ధనం వృథా


తుప్పల మధ్య నిరుపయోగంగా ఉన్న హుదూద్ గృహాలు

ప్రజాశక్తి - భోగాపురం

పేదల కోసం గత ప్రభుత్వం నిర్మించిన హుద్ హుద్ గృహాలు అప్పట్లో పంపిణీ చేయలేదు. అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం కూడా వీటిని పట్టించుకోలేదు. దీంతో ఈ గృహాలు శిథిలావస్థకు చేరుకోవడంతో పాటు ఎందుకూ పనికి రాకుండా పోయాయి. సుమారు


ఇళ్లల్లో పడి ఉన్న మద్యం సీసాలు

రూ.1.27కోట్లు వృథా అయ్యావని పలువురు అంటున్నారు. ప్రస్తుతం ఈ గృహాలు అసాంఘిక కార్యాకలాపాలకు నిలయంగా మారాయి.

టిడిపి హయాంలో కంచేరు సమీపంలోని దిబ్బలపాలెం వెళ్లే రహదారిలో రూ.1.27కోట్లతో 32 హుద్‌హుద్ గృహాలను నిర్మించారు. అప్పటి ఎమ్మెల్యే పతివాడ నారాయణ స్వామినాయుడు 2019 ఫిబ్రవరిలో వీటిని ప్రారంభించారు. కాని లబ్దిదారులకు మాత్రం అప్పజెప్పలేదు. ఆ తరువాత వైసిపి ప్రభుత్వం అధికారలంలోకి వచ్చింది. వీరుకూడా వీటి గురించి పటించుకోలేదు. దీంతో ఆ ప్రాంతంలోని కొంత మంది ఆకతాయిలకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. అంతేకాక ఈ గృహాలు ఇప్పుడు ఎందుకు పనికిరాకుండా మిగిలిపోయావని పలువురు విమర్శిస్తున్నారు. నాయకులు ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేశారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

'రెండు రోజుల్లో నిర్ణయం ప్రకటిస్తా'

ప్రజాశక్తి- చీపురుపల్లి

నా నిర్ణయాన్ని రెండు రోజుల్లో వెల్లడిస్తానని తాను ఏం చేయాలన్నదానిపై కార్యకర్తలు, అబిమానులతో మాట్లాడేందుకు వచ్చానని, వారి అభీష్టం మేరకు తన నిర్ణయం ఉంటుందని చీపురపల్లి నియోజకవర్గ ఇంఛార్జి కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం చీపురుపల్లిలో ఉన్న ఆయన నివాశానికి వచ్చారు. అధిష్టానం ఆయనకు టిక్కెట్టును నిరాకరించడంతో ఇంత వరకు ఆయన చీపురుపల్లి రాలేదు. శ్రీరామనవమిని పురష్కరించుకొని తన అభిమానులు నవమి వేడుకలలో పాల్గొనాలని కోరడంతో బుదవారం ఆయన చీపురుపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన నివాశంలో కార్యకర్తలు, అభిమానులతో కలసి మాట్లాడారు. భవిష్యత్ నిర్ణయం రెండు


కార్యకర్తలు, నాయకులతో మాట్లాడుతున్న కిమిడి నాగార్జున

మూడు రోజుల్లో తీసుకుంటానని కార్యకర్తలందరి అభీష్టమే తన నిర్ణయమని స్పష్టం చేశారు. అనంతరం నాగార్జునుని కలిసేందుకు నాలుగు మండలాల నుండి అభిమానులు కార్యకర్తలు పెద్ద ఎత్తున చీపురుపల్లి వచ్చారు. అనంతరం అభిమానులు, కార్యకర్తలతో కలసి కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి వెల్లి ప్రత్యేక పూజలను చేశారు. నాగార్జున నివాసం నుండి అభిమానులు, కార్యకర్తలు భారీ బైక్ ర్యాలీతో అమ్మవారి గుడికి తీసుకు వెల్లారు. ఈ సందర్భంగా అభిమానులు మాట్లాడుతూ నాగార్జున నిర్ణయమే తమ నిర్ణయమని నాగార్జున ఏ నిర్ణయం తీసుకున్నా ఆయన వెంటే నడుస్తామని అన్నారు.

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట



ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు ఎమ్మెల్యే అభ్యర్థులకు సంబంధించి నామినేషన్లు స్వీకరిస్తామని ఎన్నికల రిటర్నింగ్ అధికారి పి మురళీకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం వద్ద గల ఎన్నికల నిర్వహణ కార్యాలయంలో విలేకరుల సమావే శంలో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం ఆంధ్రప్రదేశ్ శాసనసభ నెంబర్ 19 ఎస్‌కోట అసెంబ్లీ నియోజకవర్గం నుండి ఎమ్మెల్యే ఎన్నిక కోసం అభ్యర్థుల నుండి నామినేషన్లు స్వీకరిస్తామన్నారు. ఈ ప్రక్రియ ఆదివారం మినహా మిగిలిన రోజులు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. నామినేషన్ వేసేందుకు వచ్చిన అభ్యర్థులు ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని ఆయన కోరారు.


వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని శ్రీరామనవమి వేడుకలు పలు గ్రామాలలో వైభవంగా నిర్వహించారు. బానాది, వావిలపాడు, వేపాడ, వల్లంపూడి, సింగరాయి, జగ్గయ్యపేట, సోంపురం, అరిగి పాలెంలో వేద పండితులు మంత్రాఛరణల నడుమ నిర్వహించారు. బానాదిలో గొంప వెంకటరావు దంపతులు, వావిలిపాడులో బీల సతీష్ దంపతులు, వేపాడలో గుమ్మడి భారతీ దంపతులు, జగ్గయ్యపేట, సోంపురం అరిగి పాలెం, జాకెరు, పాటూరు గ్రామాలలో సర్పంచులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

బొబ్బిలి: పట్టణంలో బజారులో ఉన్న రామాలయం, దావాలవీధి రామాలయంలో సీతారాముల కళ్యాణం చేసి భక్తులకు అన్నదానం చేశారు. పూజలకు భక్తులు క్యూ కట్టారు. చిన బజారు రామాలయంలో పూజలు చేశారు.

బాడంగి: మండలంలోని ఆకులకట్ట, గజరాయనివలస, పిన్నవలస, వాడాడ గ్రామాల్లో బుధవారం శ్రీరామనవమి


బాడంగి: శ్రీరాముని కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

వేడుకలు ఎస్‌విఎల్‌ఎన్ శర్మ యోజీ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.


డెంకాడ: చింతలవలస గ్రామంలో వెంకటేశ్వర స్వామి గుడిలో నవమి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.

రామభద్రపురం: మండల కేంద్రంలోని వసంతుల విధి రామాలయంలో బ్రహ్మశ్రీ బాధంపూడి నాగరామలింగేశ్వం శర్మ, ఆరికతోట రామాలయం ప్రధాన అర్చకులు చిలుకూరి రవి శర్మల ఆధ్వర్యంలో వైభవంగా కల్యాణాలు నిర్వహించారు. ఎస్.చింతలవలస రామమందిరంలో నిర్వహించిన వేడుకలలో బొబ్బిలి టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బేబీనాయన పాల్గొన్నారు. ఇందులో భాగంగా అన్నదానం చేశారు. ఈ కార్యక్రమ ంలో టిడిపి జిల్లా నాయకులు మడక తిరుపతినాయుడు, కర్రోతు తిరుపతిరావు, పాల్గొన్నారు.

గజపతినగరం: మండల కేంద్రంలో రామాలయంలో ప్రముఖ న్యాయవాది ఉప్పలపాటి రమేష్ రాజు దంపతులు కళ్యాణంలో కూర్చోగా, పలుచోట్ల వస్త్రాలు సమర్పించి నూతన దంపతులు కళ్యాణంలో పాల్గొన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో శ్రీరామదూత యువజన సంఘం అధ్యక్షులు కందుల చిన్నయ్య స్వామి పాల్గొన్నారు.

మెరక ముడిదాం: మండలంలోని పెద్దమంత్రిపేట కొందండరామ ఆలయంలో శ్రీరామ నవమి వేడుకలు గ్రామ పెద్దలు, యూత్ సభ్యులు, ఆలయ ధర్మకర్త డాక్టర్ సాసుబిల్లి హరశ్రీ రాములు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మొదటి రోజున పెండ్లి రాట, రెండవ రోజున రాత్రి ఆలయ ప్రాంగణములో భజన కార్యక్రమములు, మూడవ రోజు బుధవారం కల్యాణ మహోత్సవం, అన్నదానం చేశారు.

విజయనగరం టౌన్ : శ్రీరాముడు చూపిన మార్గం ప్రతి ఒక్కరికీ అనుచరణీయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. నగరంలో నిర్వహించిన పలు వేడుకలలో


వేపాడ: తాళిబొట్టును చూపిస్తున్న గొంప దంపతులు


విజయనగరం : వేడుకల్లో పాల్గొన్న కోలగట్ల

ఆయన పాల్గొన్నారు. చిక్కాల వీధి రామ మందిరం వద్ద నిర్వహించిన శ్రీరాముని కళ్యాణాన్ని తిలకించారు. బూడి వీధిలో కోదండరామ ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా జరిగాయి. కోలగట్ల ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలలో స్థానిక కార్పొరేటర్లు గుజ్జల నారాయణరావు, రేగాన రూపా దేవి, వరహాచారి,డొంకాడ పద్మావతి, శ్రీను పాల్గొన్నారు.

తోటపాలెంలోని కోదండ రామస్వామి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు పతివాడ సత్యనారాయణ, ఆర్లె కృష్ణారావు తదితరుల ఆధ్వర్యాన సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, మంగళ శాసనం, అనంతరం సీతారాముని కల్యాణం, సాయంత్రం పట్టాభిషేకం కార్యక్రమాలు నిర్వహించారు. గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య, బొత్స లక్ష్మణరావు కుటుంబికులు సీతారాములను దర్శించుకున్నారు.

నేటి నుంచి నామినేషన్లు

(మొదటి పేజీ తరువాయి)

నిలిపివేస్తారు. అభ్యర్థితో మొత్తం మూడు వాహనాలకు మాత్రమే అనుమతి ఉంటుంది. పోటీ చేసే అభ్యర్థులు పార్లమెంటుకు రూ.25,000, అసెంబ్లీకి రూ.10,000 ధరావతు చెల్లించాల్సి ఉంటుంది. ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులు దీనిలో 50 శాతం చెల్లిస్తే సరిపోతుంది. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పాటిస్తూ అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయాల్సి ఉంటుంది. నామినేషన్లను స్వీకరించే గదిలో, అభ్యర్థులు ప్రవేశించే ద్వారాల వద్దా సిసి కెమేరాలను ఏర్పాటు చేసి, ఈ ప్రక్రియను పూర్తిగా రికార్డు చేస్తారు. మోడల్ కోడ్ అమల్లో భాగంగా అభ్యర్థుల ఊరేగింపులను, నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమాలను సైతం వీడియో రికార్డింగ్ చేస్తారు.

నామినేషన్లు దాఖలు చేసేటప్పుడు తీసుకోవలసిన జాగ్రత్తలు

- అభ్యర్థులు నామినేషన్ల దాఖలుకు 13 రకాల డాక్యుమెంట్లను తీసుకురావాలి.
- పార్లమెంటరీ నియోజకవర్గం కోసం ఫారం-2ఎ, అసెంబ్లీ నియోజకవర్గం కోసం ఫారం-2బి సమర్పించాలి.
- నోటిఫైడ్ తేదీలలో ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు.
- పబ్లిక్ సెలవు దినాలలో నామినేషన్ స్వీకరించరు.
- పార్లమెంటుకు పోటీచేసే అభ్యర్థులు ఫారమ్ 2ఎ, అసెంబ్లీకి పోటీ చేసేవారు ఫారమ్ 2బిలో దరఖాస్తు చేయాలి.
- అభ్యర్థులు గరిష్ఠంగా 4 సెట్ల నామినేషన్ దాఖలు చేయవచ్చు.
- నామినేషన్లను ఆర్‌ఒకు గానీ, సంబంధిత ఎఆర్‌ఒకు మాత్రమే సమర్పించాలి.
- అభ్యర్థి తన నామినేషన్‌ను నేరుగా గానీ, తన ప్రపోజర్ ద్వారా గానీ సమర్పించవచ్చు.
- అభ్యర్థి నామినేషన్‌తో పాటు తమ పేరిట కొత్తగా తెరిచిన బ్యాంకు ఖాతా వివరాలను సమర్పించాలి.
- 2 కంటే ఎక్కువ నియోజకవర్గాల నుంచి అభ్యర్థులు నామినేషన్లను వేయడం కుదరదు.
- నామినేషన్ల స్వీకరణకు సంబంధించి ఒక హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశారు.
- అన్ని అసెంబ్లీ నియోజకవర్గాలలో హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేశారు.
- సువిధ యాప్ ద్వారా నామినేషన్లను దాఖలు చేసే అవకాశం ఉన్నప్పటికీ, వాటి కాపీలను భౌతికంగా ఆఒకు అందజేయాల్సి ఉంటుంది.
- ఫారమ్-26 ద్వారా తన అఫడవిట్‌ను సమర్పించాలి.
- అభ్యర్థి నామినేషన్ వేసిన దగ్గర నుంచీ, ఖర్చు అతని ఖాతాలో లెక్కిస్తారు.
- పత్రికల్లో వచ్చే ప్రకటనలు, పెయిడ్ న్యూస్ వార్తలను సైతం అభ్యర్థి ఖాతాలో లెక్కించడం జరుగుతుంది.

ముఖ్యమైన తేదీలు

-18 న గెజిట్ నోటిఫికేషన్ విడుదల. అదే రోజు నుంచి నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ ఏప్రిల్ 25
- నామినేషన్ల పరిశీలన 26న
- నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీ ఏప్రిల్ 29
- పోలింగ్ జరిగే తేదీ మే 13
- ఓట్ల లెక్కింపు జూన్ 4
- ఎన్నికల ప్రక్రియ ముగిసే తేదీ జూన్ 6.

విజయనగరం జిల్లా రిటర్నింగ్ అధికారులు

విజయనగరం ఎమ్‌పి స్థానం : కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి
ఎఆర్‌ఒ : కెఆర్‌సి ఎస్‌డిసి ఎం.సుమబాల
విజయనగరం అసెంబ్లీ స్థానం : జెసి కె.కార్తీక్
చీపురుపల్లి : ఆర్‌డిఒ బి.శాంతి
రాజాం : ఎస్‌డిసి ఎల్‌జోసెఫ్
బొబ్బిలి : ఆర్డఇఒ ఎ.సాయి శ్రీ
గజపతినగరం : ఆర్‌డిఒ ఎం.వి.సూర్యకళ
నెల్లిమర్ల : ఫారెస్టు సెటిల్‌మెంట్ ఆఫీసర్ ఎం.నూకరాజు
ఎస్.కోట : ఎస్‌డిసి పి.మురళీకృష్ణ

పార్వతీపురం మన్యం జిల్లా రిటర్నింగ్ అధికారులు

అరకు పార్లమెంట్ స్థానం : కలెక్టర్ నిశాంత్‌కుమార్
పాలకొండ : సీతంపేట ఐటిడిఎ పిఒ కల్పనా కుమారి
సాలూరు : పార్వతీపురం ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్
పార్వతీపురం : ఆర్‌డిఒ కె.హేమలత
కురుపాం : ఆర్‌డిఒ వి.వెంకటరమణ
పాడేరు : జెసి భావన వశిస్ట్
అరకు : పాడేరు ఐటిడిఎ పిఒ వి.అభిషేక్
రంపచోడవరం : : సబ్ కలెక్టర్ ఎస్.ప్రశాంత్‌కుమార్

బెదిరించి డబ్బులు లాక్కున్న ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఒక విద్యార్థిని బెదిరించి అతని నుంచి డబ్బులు లాక్కున్న ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు వన్‌టౌన్ ఎస్ఐ నరేష్ తెలిపారు. ఎస్‌కె డిగ్రీ కళాశాలలో చదువుతున్న భరత్, స్నేహితులు భార్గవ్, రాజేంద్ర, సాయి 15 రోజుల క్రితం ఫేర్‌వెల్‌డే సందర్భంగా స్టూడెంట్స్ గంజాయి తాగారు. గతంలో ఇదే కాలేజీలో చదివిన పైడిరాజు గంజాయి వీరికి గంజాయి సప్లయి చేసినట్లు కాలేజీ యాజమాన్యానికి భరత్ కుమార్ ఫిర్యాదు చేశాడని పైడిరాజు భావించాడు. ఈనెల 16న ఉదయం 8:30 గంటల సమయంలో భార్గవ్ అయ్యన్నపేటలోని తన ఇంట్లో ఉండగా పైడిరాజు అతని స్నేహితుడు వంశీ మోటార్ సైకిల్ పై వచ్చి అతని ఉన్న మొబైల్ ఫోన్ తీసుకుని నేను గంజాయి సప్లై చేస్తానని అందరికీ చెప్తావా అంటూ కొట్టారు. అంతేకాకుండా రూ.5వేలు ఇవ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు.అతని ఫోన్ నుంచి పైడిరాజు తన ఫోనుకు రూ.400 ఫోన్‌పే చేసుకోవడంతో పాటు రూ.5వేలు ఇస్తేనే ఫోన్ ఇస్తామంటూ అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ నరేష్ తెలిపారు.

చలివేంద్రం ప్రారంభం

విజయనగరం టౌన్ : బాటసారులకు ఉపశమనం కలిగించేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాపుగంటి ప్రకాష్ తెలిపారు. శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయం వద్ద బుధవారం పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేశారు. సంఘం అధ్యక్షుడు వెత్సా సత్యనారాయణ మూర్తి పర్యవేక్షణలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యదర్శి విజ్జు వెంకట శ్రీనివాసరావు, ప్రాజెక్టు ఛైర్మన్ వజ్రపు కష్టారావు, ఏడుకొండలు, ఉపేంద్ర,తవ్వా మోహనరావు, మురళీకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా సీతారాముల కల్యాణం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకొచ్చారు. పట్టువస్త్రాలు, పలురకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్నంలో కల్యాణం జరిపించారు. ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. కల్యాణ మహోత్సవ ప్రత్యేకాధికారి, సింహాచలం దేవస్థానం ఆలయ ఇఒ శ్రీనివాస మూర్తి సంప్రదాయానుసారం స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఎన్నికల నియమావళి పాటిస్తూ మంత్రి బొత్స సత్య నారాయణ, ఝాన్సీ దంపతులు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. ఆలయ ఇఒ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో చీపురుపల్లి ఆర్‌డిఒ బి.శాంతి, పలువురు ప్రముఖులు, అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. దేవస్థానం సహాయ కమిషనర్ వై. శ్రీనివాసరావు ఆధ్వర్యంలోఘనంగా ఏర్పాట్లు చేశారు. రామతీర్థంలో శ్రీ సీతారాముల కల్యాణం వీక్షించేందుకు విచ్చేసిన భక్తులకు ఆలయ సిబ్బందితోపాటు, వివిధ స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ సంస్థలు పలు సేవాకార్యక్రమాలను నిర్వహించాయి. ఎల్‌డిఎం శ్రీనివాసరావు ఆధ్వర్యంలో యూనియన్ బ్యాంకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి, మజ్జిగ పంపిణీ చేసింది.

ఇండియా కూటమి అభ్యర్థుల గెలుపుతోనే రాజ్యాంగానికి రక్షణ

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగంగానే చెబుతున్నారని అన్నారు. రిజర్వేషన్లు ఉన్నా పాలకుల విధానాల ఫలితంగా దళిత, గిరిజన, మైనార్టీలు నేటికీ వెనుకబాటుకు గురవుతున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లు ఎత్తేయాలని చూడటం దారుణమన్నారు. బిజెపి అంటే బాబు, జగన్, పవన్ కళ్యాణ్ అని, వీరు దేశాన్ని, రాష్ట్రాన్ని అభివృద్ధి చేయరని అన్నారు. ఉత్తరాంధ్రను గత టిడిపి, ప్రస్తుత వైసిపి ప్రభుత్వాలు పట్టించుకోలేదని విమర్శించారు. పాలకొండ మండలంలో జంపర కోట రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేయాలని తోటపల్లి ఎడమ కాలువ ఆధునీకరణ పనులు చేపట్టాలని, పాలిటెక్నిక్ కాలేజ్ ఏర్పాటు చేయాలని, రైతు బజారు నిర్మాణం మినీ స్టేడియం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీరఘట్టాం మండలంలో కుంబిడి ఇచ్చాపురం రిజర్వాయర్ నిర్మాణం చేయాలని, 30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేయాలని, భామిని మండలంలో ఎత్తిపోత పథకం ద్వారా సాగునీరు అందించాలని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ మాట్లాడుతూ బిజెపితో వైసిపి, టిడిపి జతకట్టడం సిగ్గుమాలిన చర్య అన్నారు రాష్ట్ర భవిష్యత్ కోసం నిష్పక్షపాతంగా ప్రజల పక్షాన పోరాడుతున్న సిపిఎం అభ్యర్థి అప్పలనర్స ప్రజాసేవకులని, నిజాయితీకి నిలువెత్తు నిదర్శనమని అన్నారు.ఇండియా వేదిక తరుపున పోటీచేస్తున్న పాలకొండ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.చంటిబాబును, అరకు పార్లమెంటు సిపిఎం అభ్యర్థి అప్పలనర్సను గెలిపించాలని కోరారు.

రాష్ట్ర హక్కులను కూడా రాబట్టకపోవడం దౌర్భాగ్యం

సిపిఎం సీనియర్ నాయకులు ఎం.కృష్ణమూర్తి మాట్లాడుతూ రాష్ట్ర సమస్త సంపదతో కూడిన హక్కులను బిజెపి ప్రభుత్వం కొల్లగొడుతూ హరిస్తుంటే గత టిడిపి గాని, నేటి వైసిపి గాని ఖండించకపోవడం అన్యాయమని అన్నారు. మోడీ దేశానికి ద్రోహం చేస్తుంటే టిడిపి వైసిపి జనసేన రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్నారని, దీన్ని ప్రజలందరూ తీవ్రంగా ఖండించాలని, సిపిఎం ఇండియావేదిక అభ్యర్థులను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

19న అప్పలనర్స నామినేషన్

సిపిఐ, కాంగ్రెస్ ఇండియా వేదిక బలపరిచిన సిపిఎం అరకు పార్లమెంటు అభ్యర్థి పి.అప్పలనర్స ఈనెల 19న ఉదయం 10గంటలకు నామినేషన్ వేస్తారని సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు పాతబస్టాండ్ వద్ద బహిరంగ సభ నిర్వహించి, అనంతరం కలెక్టరేట్ వరకు ప్రదర్శనగా చేరుకొని నామినేషన్ వేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిపిఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరవుతారని తెలిపారు. కార్మికులు కర్షకులు, గిరిజనులు, మేధావులు, అభ్యుదయవాదులు అత్యధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

కార్యక్రమాల్లో శ్రీకాకుళం జిల్లా పార్టీ కార్యదర్శి డి.గోవిందరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి మన్మథరావు, సిపిఎం నాయకులు కె.నాగమణి, కె.మోహన్ రావు, సిహెచ్ అమ్మన్నాయుడు, గంగరాపు సింహాచలం, ఆరిక భాస్కరరావు, దావాల రమణారావు, సూరయ్య, కె.నాగమణి, బి.శ్రీను, శిర్ల ప్రసాద్, దారపాడు సర్పంచ్ సుందరమ్మ, దుంబు తేజేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు బిడ్డిక శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

భానుడు భగభగ

(మొదటి పేజీ తరువాయి)

జిల్లాలో గతేడాది ఇదే సమయానికి పగటి పూట 38నుంచి 40 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రత మధ్య నమోదు కాగా ఈఏడాది 44 డిగ్రీలకు చేరుకుంది. నగరంలో అత్యధికంగా 41 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ ధాటికి తట్టుకోలేక నగరంలో మధ్యాహ్నం పూట రోడ్ల మీద జనసంచారం తగ్గింది. మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 4 గంటల వరకూ రోడ్ల మీద జనం చాలా తక్కువగా కనిపించారు. అత్యవసర పనుల విషయంలో మినహాయించి మిగతా సందర్భాల్లో రోడ్ల మీదకు వచ్చేందుకు జనం వెనుకాడుతున్నారు. నగరంలో నిత్యం రద్దీగా ఉండే కన్యకాపరమేశ్వరి కూడలి, కలెక్టరేట్, ఆర్టీసి కాంప్లెక్స్, పాత బస్టాండ్ ప్రాంతం, ఎమ్‌జి రోడ్డు, కలెక్టరేట్ ప్రాంతాలు మధ్యాహ్నం పూట నిర్మానుష్యంగా కనిపించాయి. మరోవైపు ఇళ్లల్లో ఉన్న సైతం వడగాల్పులకు ఇబ్బంది పడుతున్నారు. ఏసిలు ఉన్న వారు ఉదయం నుంచే వాని ఆన్ చేస్తూ సేద తీరుతున్నారు.

ఎండ సమయంలో బయట ఎక్కువగా తిరగడం వల్ల పిల్లల్లో ఎక్కువగా వడదెబ్బ తగిలే అవకాశం ఉందని వైద్యులు అంటున్నారు. చిన్నారులు, వృద్ధులు, గర్భిణులు, క్రీడాకారులు, బాలింతలపై ఎండ ప్రభావం ఎక్కువగా ఉంటుందని చెబుతున్నారు. మద్యం ఎక్కువగా తీసుకునే వారు జాగ్రత్తగా ఉండాలని, ప్రజలు బయట తిరిగే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు, వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వడదెబ్బ వంటివి తగలకుండా నీటిని ఎక్కువగా తీసుకుంటూ సాధ్యమైనంత వరకూ నీడలో ఉండాలని సూచిస్తున్నారు. బయట తిరిగే సమయంలో తలకు టోపీ పెట్టుకోవాలని, గొడుగు వాడాలని, రోజుకు ఐదు లీటర్లకు తగ్గకుండా నీరు తాగాలని, సమయానికి ఆహారం తీసుకోవాలని, ఉప్పు కలిపిన ద్రవాలు తాగాలని, శరీరంలో నీటి శాతాన్ని పెంచుకునేందుకు పుచ్చకాయ, కొబ్బరి నీళ్ల తాగాలని, వదులైన కాటన్ దుస్తులు ధరించాలని సూచిస్తున్నారు. ప్రజలకు అవగాహన కల్పించడం కోసం నగర పాలక సంస్థ వేసవి ఎండ నుంచి ఉపశమనం ఎలా పొందాలి అని అంశాలపై రూపొందించిన కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. రానున్న రోజుల్లో ఎండ తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తోంది.

ప్రజాశక్తి
www.prajasakti.com
విజయనగరం-మన్యం
గురువారం
18 ఏప్రిల్ 2024





ప్రచారం చేస్తున్న సిపిఎం కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ

ప్రజల పక్షాన నిలిచేది సిపిఎం

కురుపాం ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ

ప్రజాశక్తి-కొమరాడ

నిత్యం ప్రజల పక్షాన ఉంటూ సమస్యలపై పోరాటం చేస్తున్న సిపిఎం ఎమ్మెల్యే, ఎమ్‌పి అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మండంగి రమణ కోరారు. బుధవారం మండలంలోని మసిమండ , పెదపెడుము, జల, కొండకూనేరు, అంటివలస, రాజ్యలక్ష్మిపురం, కుమ్మరిగుంట, కందివలస, కోనవలస, గంగభద్ర గ్రామాల్లో ఆయన ప్రచారం నిర్వహించారు. మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో రమణకి గిరిజనులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కుస్తీ పడుతూ, కేంద్రంలో దోస్తీగా కలిసిపోయే పార్టీలను నమ్మొద్దని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన గిరిజన వ్యతిరేక చట్టాలను ఈ పార్టీలన్నీ బలపరుస్తూ గిరిజనులకు అన్యాయం చేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి సందర్భంలో గిరిజన హక్కులను కాపాడే ఎర్రజెండా పార్టీ తరపున పోటీచేస్తున్న వారిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వి.ఇందిరా, జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి, గిరిజన నాయకులు కె.సాంబమూర్తి, కె.బాలకృష్ణ, సుబ్బారావు, బి.రాజు, ప్రసాద్, బాబూరావు, శంకర్రావు, మధు, కైలాష్, జనార్దన పాల్గొన్నారు.

నామినేషన్లకు వేళాయె

ప్రజాశక్తి - నెల్లిమర్ల, భోగాపురం

వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా బడ్డుకొండ అప్పల నాయుడు గురువారం నామినేషన్ వేయనున్నారని, ఈ కార్యక్రమానికి వైసిపి నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఎంపిపి అంబళ్ళ సుధారాణి కోరారు. మంగళ వారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఉదయం 10గంటలకు తహశీల్దార్ కార్యాలయం వద్ద జరగనున్న నామినేషన్ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, మండల వైసిపి కార్యకర్తలు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, బూత్ కన్వీనర్లు, వార్డు మెంబర్లు, సోషల్ మీడియా సభ్యులు హాజరు కావాలని కోరారు. నామినేషన్ కార్యక్రమానికి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని వైసిపి మండల అధ్యక్షులు ఉప్పాడ సూర్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు.

19న బొత్స నామినేషన్

చీపురుపల్లి: ఈ నెల 19న ఉదయం 10.30 గంటలకు మంత్రి బొత్స సత్యనారాయణ వైసిపి నుండి చీపురుపల్లి అసెంబ్లీ అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు ఆ పార్టీ నాయకులు ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల వరహాలనాయుడు, బెల్లాన వంశీకృష్ణలు తెలిపారు. ఈ మేరకు స్థానిక వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు బుధవారం మాట్లాడారు. చీపురుపల్లి ఆర్‌డిఒ కార్యాలయంలో నామినేషన్ వేసిన తరువాత అక్కడ నుండి బయలుదేరి మెయిన్ రోడ్ మీదుగా ర్యాలీగా చీపురుపల్లి మూడు రోడ్ల జంక్షన్‌కు చేరుకొని అక్కడ ఏర్పాటు చేసిన బహిరంగ సభలో పాల్గొంటారని తెలిపారు. చీపురుపల్లి మండలం, నియోజకవర్గంలో ఉన్న వైసిపి అభిమానులు, నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

రేపు శంబంగి నామినేషన్

బొబ్బిలి : వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థిగా శంబంగి వెంకట చిన అప్పలనాయుడు శుక్రవారం నామినేషన్ వేయనున్నారు. పట్టణంలో ఉన్న వైసిపి కార్యాలయం నుంచి గ్రోత్ సెంటర్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులతో కలిసి ర్యాలీగా వెళ్లి ఆర్డిఒ కార్యాలయంలో ఉదయం 11గంటలకు నామినేషన్ వేయనున్నారు. నామినేషన్‌కు వైసిపి నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు.

నేడు రామకోటి నామినేషన్

శృంగవరపుకోట: సార్వత్రిక ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా గురువారం నామినేషన్ వేనున్నట్లు మండలంలోని శివరామరాజుపేట గ్రామానికి చెందిన జనసేన పార్టీ మాజీ మండల అధ్యక్షుడు కొట్టాడ లోకాభి రామకోటి తెలిపారు. పట్టణంలోని ఆర్కే గ్రాండ్ హాల్లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని ఓ పార్టీలో కుటుంబ పాలన నడుస్తుందని మరో పార్టీ అభివృద్ధిని పట్టించుకోలేదని ఇరుపార్టీల పైన నియోజకవర్గంలో ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. నియోజకవర్గం అంతా తిరిగి సమస్యలను తెలుసుకొని ప్రజాసేవకే స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేయాలని నిర్ణయించుకున్నానని ఆయన తెలిపారు. తన నామినేషన్‌కు అధిక సంఖ్యలో ప్రజలు హాజరై విజయ వంతం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో కసిరెడ్డి దేవుడుబాబు, పల్లి ప్రసన్నకుమార్ పాల్గొన్నారు.

స్వతంత్ర ఎమ్‌పి అభ్యర్థిగా 24న నామినేషన్

బొబ్బిలి: విజయనగరం స్వతంత్ర ఎమ్‌పి అభ్యర్థిగా ఈ నెల 24న నామినేషన్ వేయనున్నట్లు ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు మరిశర్ల కృష్ణమూర్తినాయుడు చెప్పారు. చెరువులు పరిరక్షణలో ఇప్పటి వరకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు విఫలమయ్యారని, రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే చెరువుల పరిరక్షణకు పని చేస్తానని చెప్పారు.

నామినేషన్లకు సిద్ధమవుతున్న అభ్యర్థులు

గుమ్మలక్ష్మీపురం : ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతున్న నేపథ్యంలో నామినేషన్లు వేసేందుకు వివిధ పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు సిద్ధమవుతున్నారు. గురువారం నుంచి ఈ నెల 25 వరకు నామినేషన్ల ప్రక్రియ జరగనుంది. ఈ నెల 19న కురుపాం ఎమ్మెల్యే, వైసిపి అభ్యర్థి పాముల పుష్పశ్రీవాణి నామినేషన్ వేయనున్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థి తోయక జగదీశ్వరి 22న నామినేషన్ వేసేందుకు సిద్ధమవుతున్నారు. మరోవైపు సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల కలయికతో ఇండియా కూటమి అభ్యర్థి మండంగి రమణ 23న నామినేషన్ దాఖలు చేయనున్నారు.

నేడు స్వతంత్ర అభ్యర్థిగా నిమ్మక జయరాజు


జియ్యమ్మవలస : మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు గురువారం ఉదయం 11 గంటలకు కురుపాం ఆర్ఓ కార్యాలయంలో స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేయనున్నారు. కొత్తపల్లి గీతకు బిజెపి టిక్కెట్ ఇవ్వడాన్ని ఆయన వ్యతిరేకించడంతో ఆ పార్టీ జయరాజును బహిష్కరించింది. దీంతో జయరాజు స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల బరిలో నిలవనున్నారు. గురువారం అసెంబ్లీ అభ్యర్థిగా, 19న పార్లమెంటుకు కూడా స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేయనున్నట్లు జయరాజు చెప్పారు.

విజయనగరం.. చరిత్ర ఘనం

- కళలకు, కళాకారులకు నిలయం
- రాజకీయంగా కీలకంగా మారుతున్న నియోజకవర్గం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరం నియోజకవర్గం.. చారిత్రక ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచ నలుదిశలా కీర్తి గడించిన గురజాడ అప్పారావు, కోడి రామమూర్తి, హరికథా పితామహుడు ఆదిభట్ల నారాయణదాసు వంటి ఎంతోమంది కవులు, కళాకారులకు నిలయమిది. ఉద్దండులైన నేతలెందరినో చట్టసభలకు పంపిన చరిత్ర కలిగి ఉంది. విద్యలనగరంగా పేరొందింది. అలాంటి విజయనగరం... ఉపాధి రహిత నగరంగా అపకీర్తి మూటగట్టుకొంది. అంతేకాదు, పాలకుల నిర్లక్ష్యం వల్ల అనేక సమస్యలు దీర్ఘకాలికంగా పట్టిపీడిస్తున్నాయి.



విజయనగరం నగరం ఏరియల్ వ్యూ


విజయనగరం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో 269 పోలింగ్ కేంద్రాల్లో ప్రస్తుతం 2,53,235 మంది ఓటర్లు ఉన్నారు. అందులో పురుషులు 1,22,964 మంది, స్త్రీలు 1,30,242మంది, ట్రాన్స్ జెండర్లు 29 ఉండగా, ఇటీవల కొత్తగా సుమారు 5 వేలు వరకు మంది చేరారు. విజయనగరం మండలంలో 15 గ్రామాలు ఉన్నాయి. ప్రస్తుతం 3.50 లక్షల వరకు నగర జనాభా ఉంది. నియోజకవర్గంలో ఈసారి పాగా వేయడానికి టిడిపి గట్టి ప్రయత్నాలు చేస్తుండగా, మరోసారి విజయపతాకం ఎగురవేయాలని వైసిపి చూస్తోంది. తన పట్టు నిలుపుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ఇప్పటికే అభ్యర్థిత్వాలు ఖరారు కావడంతో గెలుపు కోసం ఎవరి సమీకరణాలు వారు వేసుకుంటున్నారు.

విజయనగరం నియోజకవర్గం నుంచి ఎన్నికైన ఎమ్మెల్యేలు

సంవత్సరం	అభ్యర్థి	పార్టీ
2019	కె.వీరభద్రస్వామి	వైసిపి
2014	మీసాల గీత	టిడిపి
2009	పి.అశోక్‌గజపతిరాజు	టిడిపి
2004	కె.వీరభద్రస్వామి	స్వతంత్ర
1999	పి.అశోక్‌గజపతిరాజు	టిడిపి
1994	పి.అశోక్‌గజపతిరాజు	టిడిపి
1989	పి.అశోక్‌గజపతిరాజు	టిడిపి
1985	పి.అశోక్‌గజపతిరాజు	టిడిపి
1983	పి.అశోక్‌గజపతిరాజు	టిడిపి
1978	పి.అశోక్‌గజపతిరాజు	జనతా
1972	అప్పసాని అప్పన్నదొర	కాంగ్రెస్
1967	వి.రామారావు	జనసంఘ్
1962	భాట్టం శ్రీరామ్మూర్తి	కాంగ్రెస్
1957(ఉఎ)	భాట్టం శ్రీరామ్మూర్తి	సోషలిస్టు
1955	పివిజి రాజు	పిఎస్‌పి
1953 (ద్వి)	పివిజి రాజు	పిఎస్‌పి
ఉఎ	జి.సూర్యనారాయణ	పిఎస్‌పి
1952 (ద్వి)	పివిజిరాజు	సోషలిస్టు
	జి.సూర్యనారాయణ	సోషలిస్టు

అక్షరాయుధాలందించిన ఘనత

స్వాతంత్రోద్యమ కాలం నుంచి విజయనగరం నియోజకవర్గానికి ఎంతో చరిత్ర ఉంది. అప్పట్లో ఉద్యమానికి ఊపిరిగా ఉండే ప్రసార సాధనాలైన రచనలు అందించిన కవులను కలిగిన ఘనత ఈ నియోజకవర్గానికి ఉంది. సామాజిక ఉద్యమాలకు ఊపిరిలూదిన రచనలు ఎన్నో ఇక్కడ నుంచి అందించిన విషయం తెలిసిందే. ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కన్యాశుల్కం నాటకాన్ని రచించింది విజయనగరానికి చెందిన గురజాడ అప్పారావే. బాహుబలుడు కోడి రామమూర్తి, సినీ గాయని పి.సుశీల, ఇందుకూరి రామకృష్ణంరాజు, వి.రామకృష్ణ ద్వివేదుల విశాలాక్షి, శ్రీరంగం నారాయణబాబు, నిడుదవోలు వెంకటరావు, న్యాయపతి కామేశ్వరి, వంకాయల నరసింహం, మానాప్రగడ శేషసాయి, పంతుల జోగారావు వంటి కథా రచయితలను అందించిన చారిత్రక ప్రదేశం విజయనగరం.



విజయనగరం నియోజకవర్గం

కీలకం వారే

నియోజకవర్గంలో వెనుకబడిన తరగతుల వారు అత్యధికంగా ఉన్నారు. తూర్పుకాపు, యాదవ, దళిత, నాగవంశం సామాజిక తరగతులున్నాయి. ఎన్నికల్లో క్షత్రియులు ప్రభావితం చేస్తున్నారు. తూర్పుకాపు సామాజిక తరగతి ఓటింగ్‌తో అభ్యర్థి విజయావకాశాలు కనిపిస్తాయి.

నియోజకవర్గ విశిష్టతలు

1952లో విజయనగరం నియోజకవర్గం ఏర్పడింది. 16 సార్లు సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఇక్కడ అత్యధికంగా టిడిపి ఏడుసార్లు విజయం సాధించింది. అత్యధికంగా అశోక్ గజపతిరాజు టిడిపి తరపున ఆరు సార్లు, జనతా పార్టీ తరుపున ఒక సారి మొత్తం ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి స్వతంత్ర అభ్యర్థిగా ఒకసారి, వైసిపి నుంచి మరోసారి మొత్తం రెండు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. నియోజకవర్గంలో మొత్తం ముగ్గురు ఏకగ్రీవంగా ఎన్నికవడం ఒక రికార్డు. పివిజి రాజు, జి.సూర్యనారాయణ 1952లో ద్విసభ్య నియోజకవర్గానికి ఎన్నికై కొంతకాలానికి రాజీనామా చేసి, 1953లో తిరిగి వీరిద్దరు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1955లో ఎన్నికైన పివిజి రాజు ఆ తర్వాత లోక్‌సభకు ఎన్నికై శాసన సభ్యత్వానికి రాజీనామా చేశారు. దీంతో 1957లో జరిగిన ఉప ఎన్నికలో భాట్టం శ్రీరామమూర్తి సోషలిస్టుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


దీర్ఘకాలికంగా వేధిస్తున్న సమస్యలు

జిల్లా కేంద్రమైన విజయనగరం నియోజక వర్గాన్ని దీర్ఘకాలికంగా పలు సమస్యలు వేధిస్తున్నాయి. నేటికీ తాగునీటి కోసం ఇతర ప్రాంతాలపై ఆధార పడాల్సి వస్తోంది. తాడిపూడి ప్రాజెక్టు, నెల్లిమర్లలో నది వద్ద ఏర్పాటు చేసిన నీటి పథకాలే నగర వాసులకు తాగునీటికి ఆధారం. వేసవి వస్తే తాగునీటికి కటకటలాడాల్సిందే. నగరంలో అధిక బావుల్లో ఉప్పునీరు తాగడానికి పనికిరాని పరిస్థితి. కాలువ వ్యవస్థ అతిపెద్ద సమస్యగా ఉంది. నగరం పెరుగుతున్న వేగంగా కాలువ వ్యవస్థ మెరుగుపరచడంలో పాలకులు విఫలమయ్యారు. వైద్య పరంగా వెనుకబాటు కొనసాగుతోంది. విద్యాపరంగా అవకాశాలు వస్తున్నా, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకపోవడంతో ఇతర ప్రాంతాలకు వెళ్లి ఉద్యోగాలు చేయాల్సి వస్తోంది. పేదలకు పక్కా గృహాలు, ఇళ్ల స్థలాలు మంజూరు చేసినా నిర్మాణ వ్యయం పెరగడంతో లబ్ధిదారులు అప్పులు చేసి నిర్మాణాలు చేపట్టినా బిల్లులు అందక అవస్థలు పడుతున్నారు. అతిపెద్ద ఉపాధిగా ఉన్న జ్యూట్ పరిశ్రమలు మూసివేత, చిన్న పరిశ్రమలు మూతపడటంతో వేలాదిమంది ఉపాధి కోల్పోయారు. షాపుల్లో, నిర్మాణ రంగ కార్మికులుగా మారి బతుకీడుస్తున్నారు.

వైసిపిలో చేరికలు

ప్రజాశక్తి-వీరఘట్టం

భామిని మండలం లివిరి గ్రామానికి చెందిన 20 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో చేరాయి. స్థానిక ఎమ్మెల్యే వి.కళావతి క్యాంపు కార్యాలయంలో ఆమె సమక్షంలో వారంతా వైసిపిలో చేరారు. కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ గెల్లంకి రమేష్, జెసిఎస్ బామిని మండల కోఆర్డినేటర్ కొత్తకోట చంద్రశేఖర్, సర్పంచ్ బి.సౌదామణి, నాయకులు మేడిబోయిన చలపతిరావు, త్రినాథ, పి.ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే కళావతి

సీతంపేటలో పోలీసు కవాతు

ప్రజాశక్తి-సీతంపేట

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీతంపేట మెయిన్ రోడ్డుపై పోలీస్ బలగాలతో బుధవారం ఎస్‌ఐ ఎం.జగదీష్ నాయుడు ఆధ్వర్యంలో కవాతు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీస్ బలగాలను మోహరించి అప్రమత్తం చేశారు. సిబ్బందికి ఎస్పై సూచనలు, సలహాలు ఇచ్చారు.



కవాతు నిర్వహిస్తున్న పోలీసులు, కేంద్ర బలగాలు

వైసిపిది దుర్మార్గ పాలన

ఎన్నికల ప్రచారంలో టిడిపి అభ్యర్థులు

ప్రజాశక్తి - వంగర

వైసిపిది దుర్మార్గమైన పాలనని మాజీ మంత్రి, రాజాం ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కోండ్రు మురళీమోహన్ అన్నారు. మండల కేంద్రంలో మండల నాయకులు ముఖ్య కార్యకర్తలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు ప్రజా సేవంటే ఎంతో ఇష్టమన్నారు. వైసిపి పాలనను అంతమొందించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, చంద్రబాబు ముఖ్యమంత్రి అవ్వడం ఖాయమని అన్నారు.

టిడిపిలో పలువురు చేరిక


మండలంలోని జగన్నాథవలస గ్రామానికి చెందిన 25 కుటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి మాజీ మంత్రి కోండ్రు మురళీమోహన్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు బొత్స వాసుదేవరావు నాయుడు, పిన్నింటి మోహనరావు, ఉదయాన మురళీకృష్ణ రావు, లచ్చు బుక్త కృష్ణమూర్తి, పైల వెంకటరమణ, ఎం గణపతి, సిహెచ్ గంగులు తదితరులు పాల్గొన్నారు.



వేపాడ.. ఎన్నికల ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి లలితకుమారి, గొంప కృష్ణ

లలిత కుమారి ఇంటింటా ప్రచారం

వేపాడ : మండలంలోని కొత్త సింగరాయి, జగ్గయ్యపేట, గుడివాడ, ఆకుల సీతంపేట గ్రామాల్లో ఎస్.కోట టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యేగా తనకు, ఎమ్‌పిగా భరత్‌కు సైకిల్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ రాక్షస పాలన నుంచి విముక్తి కలిగించుకోవాలని లేని పక్షంలో మన ఆస్తులతో పాటు కుటుంబాలు కూడా సర్వనాశనం అయిపోతాయని చెప్పారు. ఇప్పటికే రాష్ట్రం అప్పుల్లో మునిగిపోయిన నేపథ్యంలో విజన్ కలిగిన జన నాయకుడైన చంద్రబాబు ముఖ్యమంత్రి చేస్తే తప్ప రాష్ట్రం బాగుపడదన్నారు. గొంప కృష్ణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కలిసి కట్టుగా పనిచేసి టిడిపి విజయానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, ఉపాధ్యక్షుడు పి.వెంకటరమణ, మండల ప్రధాన కార్యదర్శి కె.రమణమూర్తి, మండల ఐటిడిపి అధ్యక్షుడు సేనాపతి గణేష్, రాష్ట్ర ఎస్‌టి సెల్ కార్యవర్గ సభ్యురాలు దాసరి లక్ష్మి, మంచిన అప్పలసూరి, సిరికి జగన్నాథం, ఎన్. ముత్యాలనాయుడు, బిజెపి సీనియర్ నాయకులు గోకాడ మహేష్, జనసేన నాయకులు వబ్బిన సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంరూరల్.. పార్టీలో చేరిన వారికి కండువాల కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి విజయ్‌చంద్ర

టిడిపిలోకి ఎమ్మార్‌నగరం సర్పంచ్

పార్వతీపురంరూరల్ : మండంలోని ఎమ్మార్ నగరం సర్పంచ్ వంగపండు లక్ష్మి, వైస్ సర్పంచ్ వంగపండు త్రినాథరావు వైసిపిని వీడి బుధవారం టిడిపిలో చేరారు. స్థానిక టిడిపి కార్యాలయంలో ఎమ్మెల్యే అభ్యర్థి బోనెల విజయ్ చంద్ర సమక్షంలో పార్టీలో చేరారు. ఆయనతోపాటు ఎమ్మార్ నగరం గ్రామానికి చెందిన 300 కుటుంబాలు టిడిపిలో చేరాయి. సీతానగరం మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన సుమారు 300 కుటుంబాలు టిడిపిలో చేరాయి.

వైసిపి నుండి టిడిపిలో చేరిక

చీపురుపల్లి : చీపురుపల్లి మేజర్ పంచాయతీ నుండి పలువురు వైసిపి నుండి టిడిపిలో చేరారు. బుధవారం చీపురుపల్లి పంచాయతీ 13 వార్డు మెంబరు మీసాల కామేశ్వరి, ఆమె భర్త మీసాల శ్రీనివాసరావులతో పాటు 14వ వార్డు మాజీ మెంబరు రెడ్డి త్రినాథ, వైసిపి కార్యకర్తలు రెడ్డి అసిరినాయుడు, రెడ్డి లక్ష్మణ, రెడ్డి మన్మధరావు, బెవర బానుచందర్, వెంకటరమణ, రెల్లి అప్పారావు, గెరిడి కామరాజు కుంటుంబాలు వైసిపిని వీడి టిడిపిలో చేరాయి. వీరికి టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యుడు కిమిడి కళావెంకటరావు కండువాలు వేసి పార్టీలోనికి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు, టిడిపి మండల అధ్యక్షుడు రౌతు కామునాయుడు, ఆర్ఇసియస్ మాజీ ఛైర్మన్ దన్నాన రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లి.. పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న కళావెంకటరావు

నేడు టిడిపిలోకి 'తాడ్డి చంద్రశేఖర్'

మెరకముడిదాం: మాజీ ఎంపిపి కీర్తిశేషులు తాడ్డి కృష్ణారావు కుమారుడు తాడ్డి చంద్రశేఖర్ గురువారం టిడిపిలోకి చేరనున్నారు. ఆ రోజు సాయంత్రం గర్భాం రామమందిరం వద్ద జరగనున్న టిడిపి సమావేశంలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కిమిడి కళా వెంకటరావు సమక్షంలో ఆయన పసుపు కండువా వేసుకోనున్నారు.

ఒకే మండలం.. ఇద్దరు ఎమ్మెల్యేలు

ఇద్దరు ఎమ్‌పిలు కూడా.. • ఇదే జామి మండల ప్రత్యేకత

ప్రజాశక్తి - జామి

జిల్లాలో ఏ మండలానికి లేని విదంగా జామికి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఇద్దరు ఎంపిలు ప్రాతినిత్యం వహిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇది ప్రత్యేకమైన అంశమే అయినప్పటికీ ఎన్నికల అనంతరం సరా మామూలుగానే మండలం మిగిలిపోతోంది. తాజా ఎన్నికల వేల మరోసారి జామి మండల ప్రత్యేకతపై చర్చ సాగుతోంది.. వివరాల్లోకి వెళితే

మండలంలో 25 పంచాయతీలు ఉండగా, అందులో 13 పంచాయితీలు ఎస్‌కోట నియోజకవర్గంలోనూ, 12 పంచాయతీలు గజపతినగరం నియోజకవర్గం పరిధిలో ఉన్నాయి. ఈ ఏడాది జనవరి 22 తేదీ నాటి ఓటరు జాబితా లెక్కల ప్రకారం 46 వేలకు పైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో మహిళలు 23వేలు, పురుషులు 22 వేలు మందిపైగా ఉన్నారు. ఇందులో గజపతినగరం అసెంబ్లీ పరిధిలో 20,426 ఓటర్లు ఉండగా, వీరు విజయనగరం పార్లమెంటు అభ్యర్థిని ఎన్నుకోవాలి. అలాగే 26,074 మంది ఎస్‌కోట అసెంబ్లీ పరిధిలో ఓటర్లుగా ఉండగా, వీరు విశాఖపట్నం పార్లమెంటు అభ్యర్థిని ఎన్నుకోవాలి. ఇలా జామి మండలం ఓటర్లు, ఇద్దరు ఎమ్మెల్యేలను, ఇద్దరు ఎంపి అభ్యర్థులను ఎన్నుకొనే అవకాశం ఉంది. అయితే ఎన్నికల అనంతరం పాలన విషయంలో మాత్రం సరా మామూలుగానే ఉందని ప్రజలు అంటున్నారు. ఎన్నికల అనంతరం మండలంలో ఇద్దరు ఎమ్‌పిలు, ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రాతినిత్యం వహిస్తున్న నేపథ్యంలో మండల అభివృద్ధికి అధిక నిధులు కేటాయించాలి. కానీ ఏళ్లుగా మండలంలో సమస్యలు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఉందని చెప్పక తప్పదు. ఈ సారైనా ప్రజలు గెలిపించే ఎమ్మెల్యే, ఎంపిలు మండల అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జామి మండల ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	స్త్రీలు	పురుషులు	మొత్తం
ఎస్. కోట	13,395	12,678	26,074
గజపతినగరం	10,429	9,995	20,426
మొత్తం	23,824	22,673	46,500

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

ప్రజాశక్తి-సీతంపేట

ఎన్నికల నోటిఫికేషన్ గురువారం విడుదల అవుతుందని, అప్పటి నుంచి నామినేషన్లు స్వీకరిస్తామని పాలకొండ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి కల్పనకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటిడిఎలోని అంబేద్కర్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో నామినేషన్లు స్వీకరిస్తామని తెలిపారు. 18 నుంచి 25వ తేది వరకు ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. 26న నామినేషన్ పత్రాల పరిశీలన, 29వ తేదీ మధ్యాహ్నం 3 గంటలలోపు నామినేషన్ల ఉపసంహరణ ఉంటాయని తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను రిటర్నింగ్ అధికారి కార్యాలయ నోటీస్ బోర్డులో అందరికీ అందుబాటులో ఉంచామని తెలిపారు.



ఆర్థిక సాయం అందిస్తున్న సభ్యులు

వివాహానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -భామిని

మండలంలోని బాలేరుకు చెందిన దేవల్ల దజనీశ్వరరావు కుమార్తె పెళ్లి కోసం జిల్లా ఐక్య జంగమ సంక్షేమ సంఘం సభ్యులు ఆర్థిక సహాయం చేశారు. బుధవారం బాలేరులో సంఘం ప్రధాన కార్యదర్శి మీగడ. సంతోష్, మండల అధ్యక్షులు అప్పన్న.. రూ.37 వేలను దజనీశ్వరరావుకు అందజేశారు. కార్యక్రమంలో కోశాధికారి వి.మన్మధరావు, సభ్యులు సత్యనారాయణ, శివయ్య ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న పిఒ విష్ణుచరణ్

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన

ప్రజాశక్తి-సాలూరు

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్ట్రాంగ్ రూంలను నియోజకవర్గ ఎన్నికల ఆర్ఒ, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ బుధవారం పరిశీలించారు. రిజిష్టర్లను తనిఖీ చేశారు. అనంతరం ఆర్ఒ కార్యాలయంలో గురువారం నుంచి ప్రారంభం కానున్న నామినేషన్ల ప్రక్రియకు సంబంధించి ఏర్పాట్లపై తహశీల్దార్ సింహాచలంతో చర్చించారు. నామినేషన్లు ప్రారంభం కానున్న నేపథ్యంలో అభ్యర్థులు పాటించాల్సిన నియమాల గురించి చర్చించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పాలకొండ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యాన ప్రమాదాల నివారణపై బుధవారం అవగాహన కల్పించారు. పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు ప్రమాదాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పాలకొండ అగ్నిమాపక కేంద్రం నంబర్ 08941-260111, అగ్నిమాపక శాఖ టోల్ ఫ్రీ నంబర్ 101కు ఏదైనా ప్రమాదం, విపత్తు సంభవిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సుశాంత్ జన, వైస్ ప్రిన్సిపల్ వి.ప్రభాకర్, పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

అక్రమంగా మట్టి తవ్వకాలు

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కుంపల్లి రెవెన్యూ పరిధిలోని రాజు చెరువులో ఆ గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు ఇష్టానుసారంగా మట్టి తవ్వకాలు చేపడుతున్నారు. చెరువులో మట్టి, కంకర తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ లేకుండా రాత్రి బాగాన తవ్వకాలు చేపట్టి ఇతర గ్రామాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అదే గ్రామానికి చెందిన కొంతమంది రైతులు గ్రామ సచివాలయ సిబ్బందికి తెలియజేసినా వెనకడుగు వేయని ఆ నాయకుడు మట్టి తవ్వకాలను తనకు నచ్చినట్లు తవ్వుతానని అనుమతులు తీసుకునే పనిలేదని ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండని చెబుతున్నట్లు గ్రామస్తులు ఆరోపిస్తు న్నారు. ఈ తవ్వకాలపై గ్రామ రెవెన్యూ అధికారిని వివరణ కోరగా ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాని చెప్పారు. మట్టి తవ్వకాలకు ఎటువంటి అనుమతులూ లేవని స్పష్టం చేశారు.



మట్టి తవ్వకాలతో బక్క చిక్కిపోయిన రాజు చెరువు

పోలీసుల సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-పార్వతీపురం

పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నామని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. పార్వతీపురం రూరల్ పోలీస్ స్టేషన్‌కి సమీపంలో జిల్లా పోలీస్ సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యతనిస్తూ నూతన హంగులతో నిర్మించిన క్యాంపు ఆఫీస్, వ్యాయామశాల భవనాన్ని బుధవారం ఎస్‌పి ప్రారంభించారు. ముందుగా సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు నిత్యం విధులతో ఒత్తిడికి గురవుతారని తెలిపారు. శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలరనే ఉద్దేశంతో అన్నివసతులతో కూడిన వ్యాయామశాలను నిర్మించామన్నారు. రానున్న రోజుల్లో సిబ్బంది సంక్షేమం కోసం ప్రత్యేక ప్రణాళికలను రూపొందించి అమలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్‌పిలు ఒ.దిలీప్ కిరణ్, సునీల్ షరోన్, డిఎస్‌పిలు ఎస్.ఆర్.హర్షిత, వెంకట అప్పారావు, ట్రెయినీ డిఎస్‌పి అజీజ్, ఎఆర్ ఆర్ఐలు శ్రీరాములు, శ్రీనివాసరావు, సిఐలు సిహెచ్.లక్ష్మణరావు, కృష్ణారావు, రవికుమార్, ఎస్ఐలు దినకర్, సంతోషి పాల్గొన్నారు.

ఎస్‌పి విక్రాంత్ పాటిల్



భవన పరిసరాలను పరిశీలిస్తున్న ఎస్‌పి విక్రాంత్

ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పోస్టు భర్తీచేయాలి

ప్రజాశక్తి -సీతంపేట

సీతంపేట ఐటిడిఎ డిప్యూటీ డిఇఒ పోస్టును భర్తీ చేయాలని యుటిఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షులు ఆరిక భాస్కరరావు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రమేష్, ఎస్.మురళీమోహన్రావు, కార్యదర్శి కె.కృష్ణారావు ఒక ప్రకటనలో ఐటిడిఎ పిఒను కోరారు. గతంలో డిప్యూటీ డిఇఒగా పనిచేసిన హెచ్ఎం రిటైర్ అయిన సందర్భంగా ఈ ఖాళీ ఏర్పడిందని చెప్పారు. వెంటనే భర్తీ చేసి ఉపాధ్యాయుల సర్వీస్, పరిపాలన విషయాలకు ఆటంకం కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తిచేశారు.



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

ఆయుర్వేద వైద్య శిబిరం

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలోని బూర్జ గ్రామంలో ఆయుర్వేద వైద్యాధికారి టి.హేమాక్షి ఆధ్వర్యంలో బుధవారం ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఆయుర్వేద ఔషధాలు అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ సిబ్బంది పద్మ, నాగార్జున, రూప, ఉపాధ్యాయులు వై.జోగినాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - కురుపాం

నామినేషన్లు వేసేందుకు వచ్చే అభ్యర్థులు తప్పనిసరిగా ఎన్నికల నిబంధనలు పాటించాలని ఆర్ఒ వి.వి.రమణ సూచించారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ 18 నుంచి 25వ తేదీ వరకూ నామినేషన్లు స్వీకరించనున్నట్లు తెలిపారు. కురుపాం నియోజకవర్గానికి చెందిన నామినేషన్లు సమర్పించే అభ్యర్థులు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకూ ప్రభుత్వ సెలవులు మినహాయించి సమర్పించవచ్చన్నారు. అభ్యర్థులు తమ వాహనాలను కార్యాలయం బయట ఉంచి నామినేషన్ వేసే అభ్యర్థితోపాటు మరో నలుగురు మాత్రమే కార్యాలయంలోకి రావాలన్నారు. ఎవరు పోటీచేసినా ఫారం 2-బి ద్వారా అన్ని వివరాలను సమర్పించాలన్నారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలను తూచ తప్పకుండా పాటించాల న్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎస్ వి ఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

నెల్లూరులోని స్వర్ణభారత్ సోవు టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్‌లో గురువారం నుంచి జూన్ 30 వరకు వివిధ పారిశ్రామిక రంగాల్లో నిరుద్యోగులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు భద్రగిరి ఆర్ ఐటిఐ ప్రిన్సిపల్ సిహెచ్ సునీల్ కుమార్ తెలిపారు. పదో తరగతి, ఐటిఐ పాసైన విద్యా ర్థులకు ఎలక్ట్రికల్, మోటార్ వెహికల్ రిపేర్, డ్రైవింగ్ విభాగాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. ఐటిఐ వెల్డర్, పదో తరగతి ఫెయిలైన విద్యార్థు లకు వెల్డర్, ప్లంబింగ్, శానిటరీ విభాగాల్లో శిక్షణ ఇస్తారని తెలిపారు. శిక్షణ అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇచ్చి వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని తెలిపారు. శిక్షణ కాలంలో భోజన వసతి ఉచితంగా ఉంటుంద న్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బాబోయ్ ఎండలు

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది వేసవి ఎండలు మండిపోతున్నాయి. గుమ్మలక్ష్మీపురంలో బుధవారం గరిష్ట ఉష్ణోగ్రత 44 డిగ్రీలు నమోదు అయింది. పది రోజులుగా రోజువారి ఉష్ణోగ్రతలు 40 నుంచి 44 డిగ్రీల వరకు నమోదవుతున్నాయి. దీంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడానికి భయపడుతున్నారు. దీనికి తోడు వడగాల్పుల ప్రభావం ఉండడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఏప్రిల్ నెలలో ఎండల ప్రభావం ఈ విధంగా ఉంటే మే నెలలో ఇంకా ఏ విధంగా ఉంటుందోనని ప్రజలు భయపడుతున్నారు. వడదెబ్బకు గురికాకుండా ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించాలని వైద్యులు సూచిస్తున్నారు.

ఊటగెడ్డ నీరే దిక్కు

ఏజెన్సీలో నీటి కష్టాలు వర్ణనాతీతం

ప్రజాశక్తి-గుమ్మలక్ష్మీపురం

ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గిరిజన గ్రామాల్లో సురక్షిత తాగునీరు కల్పిస్తున్నట్లు గత, ప్రస్తుత ప్రభుత్వాలు గొప్పలు చెప్పాయి. అంతేతప్ప ఆచరణలో అమలు కాలేదు. అనేక పివిటిజి గిరిజన గ్రామాల్లో తాగునీటి సౌకర్యం కల్పించకపోవడంతో గిరిజనులకు ఊట, గెడ్డవాగులే శరణ్యంగా మారాయి. కలుషిత నీటిని తాగుతున్న గిరిజనులు అనేక వ్యాధుల బారిన పడుతున్నారు. నెల్లికెక్కువ, గొయిపాక, బీరుపాడు, వనకాబడి, దుడ్డుఖల్లు, సోంద్రకోన, లుంబేసు, తాడికొండ పంచాయతీల్లో తాగునీటి సమస్యతో గిరిజనులు నేటికీ తీవ్ర అవస్థలు పడుతున్నారు. వేసవి వచ్చిందంటే చాలు గిరిజనులకు నీటి కష్టాలు వర్ణాతీతం. మండే ఎండలకు చలమలు, బావులు అడుగంటిపోతున్నాయి. జోగిపురం, బొడ్డగూడ, మేదరి గండ, కంబగూడ, సప్పగూడ, శిఖర పాయి, వాడబాయి, ఒడ్రుబంగి... ఇలా ప్రతి గిరిజన గ్రామంలో తాగునీటి సమస్య తాండవిస్తోంది. సంబంధిత ఆర్ డబ్ల్యుఎస్ అధికారులు స్పందించి వేసవిలో తాగునీటి సమస్య లేకుండా ప్రత్యామ్నాయ మార్గం చూపాలని గిరిజనులు కోరుతున్నారు.



ఊటగెడ్డ నీరు పట్టుకుంటున్న మహిళలు



కలుషితమైన ఈ నేల బావే గిరిజనులకు దిక్కు.

ప్రజాశక్తి 7
గురువారం 18 ఏప్రిల్ 2024

విద్యుత్ ఛార్జీల భారంతో

కుదేలైన ఫెర్రో పరిశ్రమలు

- ఉద్యోగ, ఉపాధి కోల్పోయిన వేలాది కుటుంబాలు
- కేంద్ర సంస్కరణలు, టిడిపి, వైసిపిల వైఖరే కారణం

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

గడిచిన పదేళ్లలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకొచ్చిన విద్యుత్ సంస్కరణలను వైసిపి, టిడిపి ప్రభుత్వాలు అమలు చేయడంతో జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు కుదేలయ్యాయి. ఆర్థిక ఇబ్బందులతో కొన్ని ఇప్పటికే మూతపడగా, మరికొన్ని ఒడిదుడుకుల మధ్య నడుస్తున్నాయి. ఒక్క విజయనగరం జిల్లాలో మూతపడ్డ పరిశ్రమల వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 2వేల కుటుంబాలు జీవనోపాధి కోల్పోయాయి. మిగిలినవి మూతపడితే మరింత మంది జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో ఇటు కార్మికులు, అటు యాజమాన్యాలు ఆందోళన చెందుతున్నా విద్యుత్ సంస్కరణల విషయంలో వెనక్కి తగ్గడం లేదు. ఇటు గడిచిన ఐదేళ్లలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం, అంతకు ముందు చంద్రబాబు ప్రభుత్వం సంస్కరణలను శతశాతం అమలు చేయడంతో ఒకప్పుడు ఫెర్రోఎల్లాయిస్ పరిశ్రమలకు పుట్టినిల్లుగావున్న విజయనగరం జిల్లా నేడు ఆరంగంలో తిరోగమిస్తోంది.

జిల్లాలో గరివిడి, గుర్ల, మెరకముడిదాం, బొబ్బిలి, కొత్తవలస ప్రాంతాల్లో 21 వరకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమలు ఉండేవి. వీటిలో చాలా కాలం క్రితమే మూడు మూతపడ్డాయి. గత ఏడాది ఏప్రిల్ నుంచి విద్యుత్ ఛార్జీలు పెంచడంతో భారాన్ని తట్టుకోలేక బొబ్బిలిలో ఉన్న యోన, ఇంపెక్స్ గరివిడిలో ఉన్న ఆంధ్రా ఫెర్రో సహా మొత్తం 10 పరిశ్రమలు మూతపడ్డాయి. గరివిడి ఫేకర్‌లో ఉత్పత్తి తగ్గించడం వల్ల ఒకే ఒక్క ఫర్నేచర్ నడుస్తోంది. బొబ్బిలిలోని సిరి ఫెర్రో ఒడిదొడుకుల మధ్య నడుస్తోంది. ప్రభుత్వ విధానాలే ఇందుకు కారణం. ఫెర్రో క్రోమ్ ఉత్పత్తిలో విద్యుత్తు వినియోగం ఎక్కువగా ఉంటుంది. ఛార్జీలు పెంచితే అనివార్యంగా వాటి మనుగడ భారమౌతుంది. వైసిపి అధికారంలోకి రాకముందు యూనిట్ విద్యుత్తు రూ.4.95కు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ కింద మరో 5పైసలు కలిపి.. యూనిట్ రూ.5కే ఇచ్చేవారు. ఛార్జీలు భారంగా మారడంతో విద్యుత్తు రాయితీల కోసం యాజమాన్యాలు చాలా ఏళ్లుగా ప్రభుత్వానికి విజ్ఞాపనలు చేస్తూనే ఉన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో విద్యుత్ రాయితీలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ఛార్జీలు మరింతగా పెంచింది. పరిశ్రమలకు ప్రస్తుతం సరఫరా చేస్తున్న ధరపై అదనంగా యూనిట్‌కి రూ.3 చొప్పున పెంచారని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. టన్ను ఉత్పత్తిపై అదనంగా రూ.10 వేల వరకు భారం పడుతుందని చెబుతున్నాయి. నెలకు రూ.2కోట్ల వరకు అదనపు బిల్లు వస్తోందని బొబ్బిలి గ్రోత్ సెంటర్‌లోని ఒక ఫెర్రో పెద్ద పరిశ్రమ యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు. తమకు రూ.30లక్షల నుంచి రూ.50లక్షల వరకు అదనపు ఛార్జీలు వస్తున్నాయని చిన్న పరిశ్రమల యజమానులు చెబుతున్నారు. మిగిలిన యాజమాన్యాలు కూడా అత్యంత క్లిష్టమైన పరిస్థితుల నడుమ నడుపుతున్నామని, ఇదే పరిస్థితి కొనసాగితే ఎన్నాళ్లో నడపలేమని చెబుతున్నాయి. దీనికితోడు అంతర్జాతీయంగా నెలకున్న పోటీవల్ల స్టీల్ తయారీకి అవసరమయ్యే ఫెర్రో సిలికాన్, మాంగనీస్ వంటి ఉత్పత్తులకు తగిన ధర పలకడం లేదు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఫెర్రో పరిశ్రమలను మూసివేసేందుకు ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమల అసోసియేషన్ కూడా ప్రభుత్వానికి అనేక సార్లు సమస్యను విన్నవించింది. మరోవైపు కార్మికులు సిఐటియు ఆధ్వర్యాన గత ఏడాది ఆగస్టు 1న విజయనగరం కేంద్రంగా ఫెర్రో ఎల్లాయిస్ కార్మికుల సదస్సు చేపట్టిన సంగతి తెలిసిందే. అంతకు ముందు ఒకానొక దశలో ఇక పరిశ్రమలు నడపలేం అంటూ జిల్లాలోని ఫెర్రో ఎల్లాయిస్ యాజమాన్యాలు చేతులెత్తేసిన సంగతి తెలిసిందే. అయినప్పటికీ కేంద్రంలోని బిజెపి ప్రవేశపెట్టిన విద్యుత్ సంస్కరణలను గడిచిన ఐదేళ్లలో వైసిపిగానీ, అంతకు ముందు టిడిపిగానీ అమలు చేశాయి. దీంతో, విద్యుత్ ఛార్జీలు తలకు మించిన భారంగా మారడంతో ఫెర్రో పరిశ్రమలు ఆర్థికంగా కుదేలవుతున్నాయి. దీంతో, జిల్లాలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వేలాదిగా కోల్పోవడంతోపాటు ఆయా పరిశ్రమల ద్వారా జిల్లాకు రావాల్సిన ఆదాయం కూడా తగ్గిపోతోంది. ఇందుకు కారణమైన కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, టిడిపి నేడు మాయమాటలతో ప్రజలను మభ్యపెడుతున్నాయి. ముఖ్యంగా టిడిపి, వైసిపి అభ్యర్థులు పరిశ్రమల మూత, ఉపాధి అవకాశాలు కోల్పోవడం వంటివి కప్పిపుచ్చేందుకు తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్తున్నాయి. ఇదే విషయమై ఎన్నికల నేపథ్యంలో జనాల్లో చర్చనడుస్తోంది.



బొబ్బిలిలోని ఇంపెక్స్ పరిశ్రమ



మెరకముడిదాం మండలంలోని ఆంధ్రా ఫెర్రో ఎల్లాయిస్ పరిశ్రమ

క్వారీ కాదు... కాలువ

ప్రజాశక్తి-మక్కువ

ఈ ఫొటో ఏదో మట్టి తవ్విన క్వారీ అనుకుంటే పొరపడినట్లే. ఇది వెంగళరాయసాగర్ కుడి ప్రధాన కాలువకు ఆనుకొని ఉన్న 12ఎల్ కాలువ దుస్థితి. చప్పుబుచ్చంపేట నుండి వెంకటభైరిపురం వరకు సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టుకు నీరందించే కాలువ ఇలా అధ్వానంగా తయారైంది. చప్పగుచ్చంపేట సమీపంలో కాలువ మొత్తం కోతకు గురైంది. విఆర్‌ఎస్ అధికారులు గానీ, ఆయకట్టు సంఘాలు గానీ కనీసం పట్టించుకోవడం లేదని రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతేడాది ఖరీఫ్‌లో సాగునీటికి ఇబ్బంది పడాల్సి వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఈ వేసవిలోనైనా జైకా నిధులతో కాలువకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.



తవ్వకానికి గురైన కాలువ

నేడు పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో గురువారం పలు ప్రాంతాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఎపి ఇపిడిసిఎల్ ఇఇ పి.హరి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నగరంలో ధర్మపురి 33/11కెవి సభ్‌స్టేషన్ మరమ్మత్తులలో భాగంగా ఉదయం 8 గంటల నుంచి 12గంటల వరకు ధర్మపురి, బియ్యాలపేట, నోబుల్ నగర్, వసంత్ విహార్, ఎస్‌విఎన్ నగర్, పద్మావతినగర్, విధంగా కంటోన్మెంట్ ప్రాంతంలోని 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి 10 గంటలు వరకు అయ్యాన్నపేట, పాల్‌నగర్, దుప్పాడ, చిల్లపేట, జొన్నవలస, రాకోడు, పినవేమలి, సారిక, కోరుకొండ, కోరుకొండ పాలెం, దత్తగార్డెన్, గుంకలాం, రామవరం, 10 గంటల నుంచి 11 గంటల వరకు మూడిదాం, సుంకరిపేట, మలిచర్ల, చెల్లూరు, అంబటివలస, చాకలిపేట, గుండ్లపేట, కెవిఅర్ ఎస్టేట్, కొత్త కాపుపేట ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు.

ఘనంగా నవమి ఉత్సవాలు

ప్రజాశక్తి-సీతానగరం

మండలంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బొడ్డుపేట, లక్ష్మీపురం, సీతానగరం గ్రామాలలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

సీతంపేట : మండలంలోని శ్రీరామగిరి క్షేత్రంలో సీతారాముల కళ్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వాల్మీకి వనవాసి శ్రేయో సంస్థ అధ్యక్షులు ఎస్పీ పెంటయ్య మాస్టారు, కమిటీసభ్యుల అధ్వర్యంలో అర్చకులు పూజలు నిర్వహించారు. జామి తోటలో, సీతంపేట కాశీవిశ్వేశ్వర ఆలయంలో శ్రీరామనవమి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు.



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

కొమరాడ : సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. కోటిపాం గ్రామంలో సర్పంచ్ సుంకర సుగుణ ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలో భాగంగా అన్న సంతర్పణ నిర్వహించారు.

గరుగుబిల్లి : మండలంలో తోటపల్లిలో కోదండరామ స్వామి ఆలయంలో అర్చకులు అప్పలాచార్యులు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ మర్రాపు సత్యనారాయణ, ఇఒ సూర్యనారాయణ ఆధ్వర్యంలో నవమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భజనలు, శ్రీరామ కీర్తనలు, కోలాటం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

గుమ్మలక్ష్మీపురం : గుమ్మలక్ష్మీ పురంలో శ్రీరామనవమి వేడుకలు కన్నుల పండువగా జరిగాయి. సర్పంచ్ బి.గౌరీశంకర్రావు ఆంజనేయస్వామి ఆలయం నుండి సీతారాముల విగ్రహాలను రామమందిరం వరకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ఎల్విన్‌పేటలో అన్నసంతర్పణ నిర్వహించారు.



వేడుకల్లో పాల్గొన్న ఉపముఖ్య మంత్రి రాజన్నదొర

సాలూరు : శ్రీరామనవమి సందర్భంగా బుధవారం పట్టణంలో వివిధ రామమందిరాల్లో జరిగిన పూజల్లో డిప్యూటీ సిఎం రాజన్నదొర పాల్గొన్నారు. ఆయన వెంట అర్బన్ బ్యాంక్ అధ్యక్షులు జర్జాపు ఈశ్వరరావు, వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి జర్జాపు సూరిబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు యర్రా దాలినాయుడు, సేవా సమితి నాయకులు రాజగోపాల్, కౌన్సిలర్ గుల్లిపిల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

విజయనగరం కోట: నగరంలోని కొత్త అగ్రహారంలో గల రోటరీ దశిగి పేర్రాజు మ్యూజిక్ అకాడమీ నిర్వహణలో శ్రీరామనవమి వేడుకలు బుధ సాయంత్రం సంగీతార్చనతో అత్యంత వైభవంగా జరిగాయి. ద్వారం నరసింగరావు స్కూల్ ఆఫ్ ఆర్ట్స్ సొసైటీ అధ్యక్షులు ఉసిరికల చంద్రశేఖరరావు, అకాడమీ ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి విద్యార్థులు, అధ్యాపకులు రామపట్టాభిషేక చిత్రపటానికి పూలమాలవేసి, రాముని కీర్తనలు ఆలపించారు . ప్రిన్సిపాల్ డాక్టర్ మండపాక రవి రాముని జీవిత విశేషాలను వివరిస్తూ ఆయన గుణాలను విద్యార్థులు అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో అకాడమీ అధ్యాపకులు బాలాజీ స్వామి, మహేశ్వర రావు, భానుహర్ష, హారిక, శారద, వంశీకృష్ణ, విద్యార్థులు, తల్లిదండ్రులు, రోటరియన్లు, ప్రముఖులు పాల్గొన్నారు.



విజయనగరం: వేడుకల్లో పాల్గొన్న అకాడమీ ప్రతినిధులు

ఎన్నికలకు అంతా సిద్ధం

నేటి నుంచి నామినేషన్ల స్వీకరణ

మన్యం జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం మన్యం జిల్లాలో ఎన్నికల నిర్వహణకు అంతా సిద్ధంగా ఉన్నామని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నిశాంత్ కుమార్ తెలిపారు. ఎన్నికల నిర్వహణపై బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు గురువారం నోటిఫికేషన్ విడుదల కానుందని చెప్పారు. గురువారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తామని చెప్పారు. 26న స్క్రూట్నీ జరుగుతుందని, 29వ తేదీ వరకు ఉపసంహరణకు గడువు ఉందని చెప్పారు. నామినేషన్లను పని దినాల్లో ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం మూడు గంటల వరకు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో స్వీకరిస్తారని చెప్పారు. ఎన్నికలలో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని చెప్పారు. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు వార్తలు తదితర పోస్టులపై నిరంతర నిఘా ఉందని వెల్లడించారు. పెయిడ్ న్యూస్‌పైన నిఘా ఉందని, సంబంధిత అభ్యర్థుల ఖాతాల్లో దానికి విలువ కట్టి జమ చేస్తారని తెలిపారు.

జిల్లాలో ఇప్పటివరకు 48 ఎఫ్ఎస్‌సి, 36 ఎస్ఎస్‌సిటి, 16 వివిఎస్‌టి, 4 వివిటి బృందాలు పనిచేస్తున్నాయని చెప్పారు. జిల్లాలో మొత్తం 342 ఫిర్యాదులు అందాయని, అందులో 171 ఫిర్యాదులు ఎన్నికల కమిషన్ పోర్టల్‌లో నమోదయ్యాయని, వాటిలో 166 పరిష్కరించామని వివరించారు. సి-విజిల్‌లో 91 ఫిర్యాదులు అందగా వాటన్నిటినీ పరిష్కరించామన్నారు. 1950 టోల్ ఫ్రీ నెంబర్‌కు 21 ఫిర్యాదులు అందగా వాటిని పరిష్కరించామని చెప్పారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి ఉల్లంఘనలో భాగంగా 64 మంది వాలంటీర్లు, నలుగురు కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను తొలగించామని, ఒక రెగ్యులర్ ఉద్యోగిని సస్పెండ్ చేశామని ఆయన వివరించారు. రాజకీయ పార్టీల నాయకులపై 3 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశామన్నారు.

జిల్లాలో 823 మంది వాలంటీర్లు రాజీనామా చేశారని, 24 మంది వాలంటీర్లపై పార్వతీపురం నియోజకవర్గంలో ఎఫ్ఐఆర్ నమోదు చేశామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్, ఎస్‌పి విక్రాంత్‌పాటిల్

కురుపాం నియోజకవర్గంలో ఒక కాంట్రాక్టు ఉద్యోగిపై ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయడం జరిగిందని ఆయన చెప్పారు. జిల్లాలో అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో - ములిగూడ, బత్తిలి, భామిని, పి.కోనవలస, కూనేరు కూడళ్లలోను, గుణుపూర్, పద్మాపూర్, దండిగాం, ఆర్ కె బట్టివలస, అడారు వద్ద చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని కలెక్టర్ చెప్పారు. వీటన్నిటిలో వెబ్ కాస్టింగు ఏర్పాటు చేశామన్నారు. కొటియా గ్రామాల్లో పోలింగ్ గతంలో జరిగే విధంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు జరిగాయని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

ఎస్‌పి విక్రాంత్ పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించుటకు అన్ని చర్యలు చేపట్టామన్నారు. బందోబస్తు పటిష్టంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. నామినేషన్లను సమర్పించుటకు వెళ్లే అభ్యర్థులు ముందుగా అనుమతి పొందాలని, తద్వారా ఆ సమయంలో అవసరమగు భద్రత, బందోబస్తు చర్యలు చేపట్టగలమని తెలిపారు. 25 పోలింగ్ కేంద్రాల లొకేషన్లను నక్సల్ ప్రభావిత ప్రాంతంగా గుర్తించామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న అదితి విజయలక్ష్మి గజపతిరాజు

గెలుపు కోసం శ్రమించండి

టిడిపి అభ్యర్థి అదితి గజపతిరాజు

ప్రజాశక్తి-విజయనగరం కోట

టిడిపిని గెలిపించేందుకు శక్తివంచన లేకుండా పని చేయాలని పార్టీ నాయకులకు, కార్యకర్తలకు విజయనగరం నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థిని పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు సూచించారు. బుధవారం అశోక్ బంగ్లాలో 21వ వార్డు నుండి 30వ వార్డులకు సంబంధించిన వార్డు కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, కార్పొరేటర్ అభ్యర్థులు, యువత కమిటీ, మహిళా కమిటీ, యూనిట్ ఇన్‌ఛార్జి, బూత్ ఇన్‌ఛార్జులతో సమావేశమయ్యారు. బూత్‌ల వారీ ప్రతి ఇంటికి వెళ్లి చంద్రబాబు నాయుడు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలు, కలలకు రెక్కలు పథకాల గురించి వివరించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, కర్రోతు నర్సింగరావు, నగర అధ్యక్షులు ప్రసాదుల లక్ష్మీ వరప్రసాద్, పిల్లా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న తాగునీటి కష్టాలు



- అవసరం 42 ఎంఎల్‌డి ... వస్తున్నది 27 ఎంఎల్‌డి
- ఐదేళ్లుగా రెండు రోజులకోసారి సరఫరా
- అంతకుముందు నాలుగు రోజులకోసారి..
- ప్రాజెక్టు నుంచి వచ్చే నీరే ఆధారం
- కానరాని సమ్మర్ యాక్షన్ ప్లాన్


ప్రజాశకి-విజయనగరం టౌన్

వేసవి వచ్చిందంటే నగర ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. నగర శివారు ప్రాంతాలు, విలీన పంచాయతీలకు కుళాయిలు ద్వారా రోజూ నీటి సరఫరా నేటికీ జరగడం లేదు. దీంతో ఆయా ప్రాంతాల ప్రజలు వాటర్ ట్యాంకర్లపైనే ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా నీటి సరఫరా కాకపోవడంతో వేసవి వస్తే చాలు వాటర్ ప్లాంట్లు దగ్గర కొనుక్కోవాల్సిందే. వైసిపి హయాంలో గత ఐదేళ్లగా రోజు తప్పించి రోజు మాత్రమే తాగునీటి సరఫరా చేస్తుండగా, అంతకుముందు టిడిపి హయాంలో నాలుగురోజుల కొకసారి సరఫరా చేశారు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం ప్రతి మనిషి అవసరాల కోసం రోజుకు 130 లీటర్లు నీరు అవసరం. విజయనగరంలో 3లక్షలు దాటి జనాభా ఉన్నారు. ఒకరికి రోజుకు సరాసరి 150 లీటర్లు అవసరం కాగా, రెండు రోజులకు కలిపి 130 లీటర్లు నీరు కూడా అందడం లేదు. నగర పాలక సంస్థ ద్వారా నగర ప్రజలకు రోజుకి 27ఎంఎల్ డి నీరు మాత్రమే సరఫరా కావడంతో రోజు తప్పించి రోజు తాగునీటి సరఫరా చేయాల్సి వస్తోంది. అరకొర నీటితో నగర ప్రజలు సర్దుకోవాల్సిన పరిస్తితి ఏర్పడింది. గత కొన్నాళ్లగా ఇదే పరిస్థితి ఉన్నా పాలకులు తగు చర్యలు తీసుకోవడం లేదు. గతంలో టిడిపి హయాంలో నాలుగైదు రోజులకొకసారి తాగునీటి సరఫరా జరిగేది. ప్రస్తుతం రోజు తప్పించి రోజు రావడంతో ప్రజల్లో అంత వ్యతిరేకత వ్యక్తం కావడం లేదు. మరో వైపు రూ.200కే కుళాయి కనెక్షన్లు సుమారుగా 10వేలు ఇచ్చారు. నగరంలో కొత్తగా 11 నీటి ట్యాంకర్లు కట్టారు. కుళాయిలు ఇచ్చారు తప్ప నీటి సరఫరా మాత్రం జరగడం లేదు.

విలీన ప్రాంతాలకు అందని తాగునీరు

నగర పాలక సంస్థలో విలీనమైన గాజులరేగ, జమ్ము నారాయణ పురం, కెఎల్ పురం, ధర్మపురి, అయ్యన్నపేట, అయ్యప్ప నగర్, రామకృష్ణ నగర్, గురజాడ అప్పారావు నగర్, ఎల్‌బిజి నగర్, కెఎల్ పురం రెవెన్యూ కాలనీ వంటి ప్రాంతాలకు నేటికీ ట్యాంకర్లు నీరే గతి. అది కూడా వారంలో రెండుసార్లు మాత్రమే టాంకర్ ద్వారా నీటి సరఫరా జరుగుతుంది. విలీన పంచాయతీలు విలీనం జరిగి 7 ఏళ్లు దాటుతున్నా నేటికీ పైపు లైన్లు ద్వారా తాగునీరు సరఫరా కావడం లేదు. అమత పథకం ద్వారా పైపు లైన్లు, రూ.200 కుళాయిలు ఇచ్చారు తప్ప నీరు మాత్రం నేటికీ సరఫరా కావడం లేదు. దీంతో టాంకర్ల ద్వారా మాత్రమే సరఫరా చేస్తున్నారు. వినాయక నగర్‌లో ఉన్న 50 కుటుంబాలకు ఒకటే బోరు, అది వేసవి కాబట్టి ఎండిపోయింది. రామకృష్ణనగర్‌లో నాలుగు బోర్లు ఉంటే మూడు ఎండిపోయాయి. మరొకటి రేపో మాపో ఎండిపోతుంది. నాలుగు రోజులకు ఒకసారి వచ్చే నీరు ఆ కాలనీ వాసులకు జీవనాధారంగా మారింది.



నీరు రాని కుళాయి

ప్రాజెక్టుల నీటిపైన ఆధారం

నగరానికి మంచి నీటిని అందించే తాటిపూడి, నెల్లిమర్ల నీటి పథకాలు ఎండిపోతుండటంతో ప్రతి ఏటా ఆంధ్ర, తోటపల్లి నుంచి నీటిని తెప్పించుకుంటే తప్ప విజయనగరం పట్టణానికి నీరు ఉండడం లేదు. వేసవి కాలం వస్తే నీరు తెప్పించుకోవడం గత కొన్నేళ్లుగా జరుగుతుంది. నగర ప్రజలకు తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారంలో టిడిపి, వైసిపి పాలకులు విఫలమయ్యారు. ఎన్నికల సమయం కావడంతో ఓట్లపై ప్రభావం పడకుండా ఫిబ్రవరిలోనే రెండు నెలలకు కావాల్సిన నీటిని ఆంధ్ర ప్రాజెక్ట్ నుంచి ముందుగానే నెల్లిమర్ల స్టోరేజ్ పాయింట్ కు తరలించారు. మరో 40 రోజులు వరకు ఇబ్బంది ఉండదు. ఈ లోగా వర్షం పడితే పర్వాలేదు. లేదంటే మళ్లీ ఆంధ్ర, లేదంటే తోటపల్లి ప్రాజెక్ట్ నీటిని తెప్పించుకోవాల్సిందే. లేకుంటే నీటి కష్టాలు తప్పవు.

సమ్మర్ యాక్షన్ ప్లాన్ గాలికి

మరోవైపు వేసవి వస్తే నీటి ఇబ్బంది లేకుండా ముందస్తుగా జనవరి నెలాఖరులో ఇంజినీరింగ్ అధికారులు సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసి దాని కోసం నిధులు కేటాయించే వారు. బోర్లు మరమ్మత్తులు, ట్యాంకర్లు పెంపు ,లీకేజీల అరికట్టేందుకు చర్యలు తీసుకునే వారు. ఏప్రిల్ నెల పూర్తి అవుతున్నా నేటికీ ఎటువంటి సమ్మర్ యాక్షన్ ప్లాన్ లేదంటే పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

20 ఏళ్లుగా కుళాయికి నోచుకోలేదు



రామకృష్ణా నగర్ లో చుట్టూ కుళాయిలు ఉన్నాయి. కానీ మా కాలని ఏర్పడి 20 ఏళ్లయినా నేటికీ మున్సిపల్ కుళాయిలు లేవు. మేము సిపిఎం అధ్వర్యంలో పోరాడితే రెండురోజులకొకసారి మున్సిపాలిటీ వారు రెండు వాటర్ ట్యాంకులు పంపిస్తున్నారు. అవి ఏమూలకూ సరిపడటం లేదు, మాకు సాముహిక మరుగుదొడ్లు ఉన్నాయి కానీ నీరు లేక పోవడం తో వాటిని ఉపయోగించు కోలేక పోతున్నాం. 130 కుటుంబాలు ఉన్న కాలనీకి కుళాయి లు లేకపోవడం దారుణం.

- ఎం.జగదాంబ, రామకష్ణ నగర్

కొనుక్కుంటేనే మాకు నీరు



2009లో కాలనీ ఏర్పడినప్పటి నుంచి మాకు మున్సిపల్ కుళాయిలు లేవు. తాగునీరు కొనుక్కోవడం తప్ప మాకు మరో దిక్కు లేదు. ఎమ్మెల్యేను, అధికారులను నిలదీస్తే బోరు నీటినే ట్యాంకర్లలో నిల్వ చేసి పైప్ లైన్ ద్వారా వాడుకలకు పంపిస్తున్నారు. నగరం నడిబొడ్డున ఉన్నా కుళాయినీరు ఇవ్వకపోవడం అన్యాయం. వెంటనే మున్సిపల్ కుళాయిలు వేసి తాగునీటి కష్టాలు తీర్చాలి.

- వి.లక్ష్మి, వై ఎస్ఆర్ కాలనీ, తోటపాలెం.